

# భవానీద్వీపం

## -వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 30 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

' మానవ శరీరంలోని సంధులు మర్మస్థానాలను ప్రేరేపించడం ద్వారా రోగ నివారణ చేయవచ్చు. శరీరానికి జవసత్వాలను చేకూర్చవచ్చు ' ప్రశాంత గంభీర స్వరంలో వివరిస్తున్నారు అగస్త్య పెరియాసన్.

' ఆ సంధి స్థానాలను లక్ష్యం చేసుకుని సరిగ్గా దాడి చేయగలిగితే ఎంత బలవంతుడినైనా మట్టి కరిపించవచ్చు.అవయవాలను పనికిరాకుండా చేయవచ్చు, చివరికి శత్రువు ప్రాణాలను తీయవచ్చు కూడా '

ఎత్తైన మట్టి అరుగు రంగు రంగుల ముగ్గులతో అలంకరించి వున్నది. అరుగుమీద కాషాయవర్ణంలో వున్న మెత్తటి వస్త్రం పరిచబడి వున్నది. అరుగు మధ్యలో ఎర్రచందనంతో చేసిన విశాలమైన పీఠం మీద పద్మాసనంలో కూర్చుని వున్నాడు ఆయన. ఆయనకు కుడిప్రక్కన చేతులు కట్టుకుని చలనంలేని నల్లరాతి శిల్పంలా నిల్చుని వున్నాడు ఆసన్, పంక్తికంఠన్.

ఎదురుగా కూర్చుని వున్న శిష్యులు శ్రద్ధగా వింటున్నారు. వారిలో తానూ కూర్చుని వింటున్నాడు సమర్థుడు. సమర్థుని చూపులు తననే నిశితంగా పరికిస్తున్న పంక్తికంఠన్ చూపులతో భేటీ పడుతున్నాయి.ఒకరినొకరు అంచనా వేస్తున్నట్లు చూస్తున్నారు. సమర్థుని చెవులు పెరియాసన్ పలుకులకు అంకితం అయినాయి.

'కఫ, వాత, పిత్తములనే త్రిగుణాల సమ్మిళితమైన మానవ దేహం ఆయా గుణాల ప్రభావంతో ఆరోగ్యము, అనారోగ్యము, తేజస్సు, ఓజస్సులను కలిగివుంటుంది. ఈ త్రిగుణాల ప్రభావముతో ప్రాణశక్తి నూట ఎనిమిది సంధుల ద్వారా, డెబ్బైరెండువేల నాడుల ద్వారా నిరంతరమూ శరీరములో సంచరిస్తూ వుంటుంది' అంటూ ఆగిపోయాడు పెరియాసన్. 'అయితే యిక్కడ ఒక విశేషం వున్నది, ప్రాణశక్తికి సంబంధించి. తెలుసా? చెప్పగలరా ఎవరైనా?' అంటూ అందరినీ ప్రశ్నార్థకంగా చూశాడు. ఆయన చూపులు సమర్థుని మీద నిలిచిపోయాయి. 'సమర్థా! చెప్పగలవా?' అన్నాడు.

చూపులను పంక్తికంఠన్ మీదినుండి మరలిస్తూ గురుదేవుని వైపు చూశాడు సమర్థుడు. 'ముందు శ్రద్ధగా వినడం నేర్చుకో, తరువాత సమాధానం యివ్వడం ఎలాగో తెలుస్తుంది' అన్నాడు పంక్తికంఠన్ పరిహాసంగా చిన్నగా నవ్వుతూ.

'ప్రాణశక్తి నిరంతరమూ మానవ శరీరములో సమయానుసారం ప్రసరిస్తూ వుంటుంది. బ్రాహ్మీ ముహూర్తములో మేధస్సులో, ఉభయ సంధ్యలలో అంతఃకరణంలో, ఉదయ వేళలో మనసులో ప్రాణశక్తి సంచరిస్తూ వుంటుంది. అందుకే బ్రాహ్మీ ముహూర్తము సాధనకు, ఉభయసంధ్యలు సదాచరణకు, ఉదయ వేళ సంకల్ప శక్తికి సానుకూలమైనవి' శాంతంగా చిరునవ్వుతో పలికాడు సమర్థుడు. యిప్పుడేమంటావు అన్నట్టు పంక్తికంఠన్ వైపు చూశాడు పెరియాసన్. పంక్తికంఠన్ ముఖం మ్లానమైంది. తలదించుకున్నాడు.

చెప్పుమన్నట్లుగా గురుదేవుడు చేతిని సాచడంతో సమర్థుడు కొనసాగించాడు. 'ప్రాణశక్తి పగలూ రాత్రీ మూడవ ఝాములో కాలేయములో సంచారం చేస్తుంది. ఆ సమయానికి పచనం ఐన ఆహారము శక్తిని యిస్తుంది. ప్రాణశక్తి సంచారమును గమనించడం ద్వారా తోడు మర్మ , పాడు మర్మ విద్యలలో ప్రావీణ్యం సాధించవచ్చు' ముగించాడు సమర్థుడు! పంక్తికంఠన్ నమ్మలేనట్లుగా చూశాడు. గురుదేవుడు ఆనందం నిండిన కనులతో చూశాడు. అది మూడవ రోజు సమర్థుడు విద్యార్థిలా సేవించడం మొదలుబెట్టి.

మర్మవిద్య రహస్యాలను సంవత్సరాలతరబడి సాధన చేసినట్లు విశదీకరిస్తుంటే ఆశ్చర్యం అసూయ కలగలిసిన చూపులతో చూస్తున్నాడు పంక్తికంఠన్. ' మర్మవిద్యలో నాలుగు భాగాలు అని మహాసాధకుల ఉవాచ. శరీరంలోని 96 సంధుల స్పర్శతో శత్రువును నిర్వీర్యుడిని చేయడం, శరీరభాగాలను చచ్చు వచ్చినట్లు చేయడం తోడుమర్మ అనబడుతుంది. ప్రాణహాని లేకున్నా, అవయవాల కదలికలు లేకుండా చేస్తుంది తోడుమర్మ కళ. శరీరములోని 12 సంధి స్థానాలపై దాడిచేయడం 'పాడు మర్మకళ ' అనబడుతుంది. యిది ప్రాణాలను తీస్తుంది, శాశ్వతంగా జీవచ్ఛవాన్ని చేస్తుంది శత్రువును. గురుదేవుడు రహస్యంగా దాచిన సంధిస్థానాల మర్మకళ తట్టుమర్మకళ అనబడుతుంది. చేతులను, వేళ్ళను, మరే ఆయుధాలనూ వుపయోగించకుండా కేవలం చూపులద్వారా శరీరంలోని సంధి స్థానాలపై దాడిచేసి శత్రువును నిర్వీర్యుడిని చేయడం, నిర్జీవుడిని చేయడం నూకు మర్మకళ 'అని ముగించాడు సమర్థుడు. తాను చెప్పదలచుకున్నది పూర్తి అయినట్లు అభివాదం చేశాడు గురుదేవుడికి.

అసూయను, ఆవేశాన్ని అదుపు చేసుకోలేకపోయాడు పంక్తికంఠన్. ' పెరియాసన్ అనుమతి లేకుండా పవిత్రమైన విద్యారహస్యాలను సాధన చేయడం అపచారం! సంవత్సరాలతరబడి సాధన చేయాల్సిన విద్యను యితడు చులకన చేస్తున్నాడు ' ఉక్కు కడ్డీలాంటి చేతిని వూపుతూ సమర్థుడిని చూపించాడు గురుదేవుడికి.

చిరునవ్వు చిందిస్తూ ' తీవ్రమైన జిజ్ఞాసతో జ్ఞాన సముపార్జన చేయడం నేరం కాదుకదా పంక్తి కంఠా! ' అన్నాడు. ఆవేశం అధికమైంది అతడికి ' సాధన ద్వారా కాక కేవలం వినికిడితో, పఠనంతో అబ్బిన జ్ఞానం ఆచరణకు పనికిరాదు కదా పెరియాసన్! యిది మహా యుద్ధ విద్య! పోరాటపటిమ సాధనతో అబ్బుతుంది కానీ సమాచార సేకరణతో కాదు కదా!' అన్నాడు. ' అతడి పోరాట పటిమను పరీక్షిస్తావా పంక్తి కంఠా? ' అన్నాడు పెరియాసన్. ' మీ ఆజ్ఞ అయితే క్రమశిక్షణ తప్పినందుకు శిక్షిస్తాను కూడా పెరియాసన్! ' అన్నాడు పంక్తికంఠన్.

రివ్వున ధ్వని చేస్తూ తన ఎడమచెంపను రాసుకుంటూ దూసుకెళ్లిన బాణం మూడురోజులుగా అతడికి నిద్ర లేకుండా చేసింది. పొరపాటున తాను తల కదిలించి వుంటే? అన్న ఆలోచన ఎంత అదుపుచేసుకోవాలనుకున్నా అతడిని వులిక్కిపడేట్లు చేస్తున్నది మూడురోజులుగా. గద్దలా ఆ మహాసర్పాన్ని తన్నుకునివెళ్ళి భూమిలో దిగబడ్డ బాణం, సహచర విద్యార్థుల చూపులు అతడిని వెన్నాడుతున్నాయి. దెబ్బతిన్న అహం ప్రతీకారాన్ని కోరుతున్నది.

మూడురోజులుగా అవకాశం కోసం ఎదురుచూస్తున్నాడు.

పెరియాసన్, ఆసన్ చేస్తున్న చర్చతో ఉత్సుకత నెలకొన్నది మిగిలిన శిష్యుల ముఖాలలో. ఏదో జరగబోతున్నది అని ఉత్కంఠ కనిపిస్తున్నది. సమర్థుడు ప్రశాంతంగా చిరునవ్వులు చిందిస్తూ చేతులు కట్టుకుని నిలబడి చూస్తున్నాడు.

'సమర్థా!' ఏమంటావు అన్నట్టు చూస్తూ పిలిచాడు పెరియాసన్. మీ ఆజ్ఞ అన్నట్టు నమస్కరించి ఊరుకున్నాడు సమర్థుడు. పంక్తికంఠన్ వైపు చూశాడు పెరియాసన్ ప్రశ్నార్ధకంగా. అతడి అభిప్రాయాన్ని గుర్తించాడు. సరే! అతడి పోరాట పటిమను పరీక్షించుకో అన్నట్టు చిరునవ్వుతో చేతిని ఊపి సంజ్ఞ చేశాడు.

ఆనందంతో బిగ్గరగా నవ్వుతూ సింహంలా లంఘించాడు పంక్తికంఠన్. ఒక్క దూకులో సమర్థుడిని సమీపించి పరిహాసంగా తల ఎగరేస్తూ నవ్వాడు. ప్రశాంతంగా అడుగులేస్తూ గురుదేవుడు కూర్చున్న వేదికను సమీపించాడు సమర్థుడు. గురుదేవుడి పాదాలమీదనే దృష్టి నిలిపి నుదురు తాకించి నమస్కరించాడు. లిప్తపాటు పెరియాసన్ ముఖంలోకి తదేకంగా చూశాడు. ధనుర్బాణాలను వేదికపై వుంచాడు. ' అనుజ్ఞ యివ్వండి స్వామీ ' అన్నాడు. పెరియాసన్ మందహాసంతో కొనసాగుమన్నట్లు సంజ్ఞ చేశాడు.

వెనుదిరిగి పంక్తి కంఠన్ వద్దకు చేరుకొని, అతడికి అభివాదం చేశాడు సమర్థుడు. మర్మవిద్యా సంప్రదాయం ప్రకారం రెండు భుజాలను వంచి, ధనుస్సు భంగిమలో ముందుకు వంగి రెండుచేతులనూ జోడించాడు. అదేవిధంగా ప్రత్యభివాదం చేయాలి నియమానుసారం. కానీ అతను తలను పంకించి వేగంగా అడుగులేశాడు ముందుకు. నిదానంగా తానూ కదిలాడు సమర్థుడు.

సాధన కోసం రూపొందించిన గోదా కు చేరుకున్నారు. ఆరు అడుగుల లోతున, పద్దెనిమిది అడుగుల పొడవు, వెడల్పు కలిగిన గుంత నాలుగు అడుగుల నిండా మెత్తని బంకమన్నుతో నింపబడి వున్నది. పైన రెండు అడుగుల మందం మెత్తని యిసుక నింపబడి ఉన్నది. అది మర్మయుద్ధవిద్యా సాధనకోసం ఏర్పాటు చేసిన గోదా. రెండుప్రక్కలా చేరి చూడడం మొదలెట్టారు మిగిలిన విద్యార్థులు. వీరాసనంలో గంభీరంగా వేదికమీదినుండి చూస్తున్నాడు పెరియాసన్.

మర్మయుద్ధ విద్య చరిత్రలో విశిష్టమైన పోరాట ప్రదర్శన ప్రారంభం అయ్యింది. మూడురోజుల అనుభవం ఒకరిది, పదమూడు సంవత్సరాల నిరంతర సాధన మరొకరిది. చూస్తుండగానే బుసబుస పొంగిన నరాలు, కండరాలతో ఉక్కుమనిషిలా కనిపిస్తున్నాడు పంక్తికంఠన్. యినుప

ముళ్లవంటి పదివేళ్ళు పది బాణాలలాగా సమర్థుడి శరీరాన్ని తూట్లు పొడవడానికి వువ్విళ్లూరుతున్నాయి. ఒక్క నిముషంపాటు చేతులుజోడించి కనులు మూసుకున్నాడు సమర్థుడు. చూస్తుండగానే ఆయన శరీరంలో మార్పు గోచరం అయ్యింది. కనులు ఎఱ్ఱబడ్డాయి. దండలు, వక్షస్థలం, తొడలు, పిక్కలు పొంగాయి.

గాలి అలలు తెరలుగా రేగేట్లు సింహనాదం చేశాడు పంక్తికంఠన్. చేతులు సాచి ముందుకు దూకాడు. ఆ ప్రాంగణం అంతా కంపించేలా దీర్ఘమైన ఓంకార నాదంతో ముందుకు దూకాడు సమర్థుడు. కాలి వ్రేళ్ళు, చీలమండలు, పిక్కలుమొదలైన పదకొండు మర్మస్థానాలను లక్ష్యంగా చేసుకుని బాకులలాంటి వేళ్ళను విసురుతున్నాడు శత్రువు.

సునాయాసంగా, లాఘవంగా కదులుతూ, తన అరచేతులను, వేళ్ళను అడ్డుపెడుతూ కాచుకుంటున్నాడు సమర్థుడు. చుట్టూ చేరిన విద్యార్థులు నోళ్లు వెళ్ళబెట్టారు, పంక్తికంఠన్ నివ్వెరపోయాడు. సంవత్సరాల తరబడి సాధన చేసినట్లు వున్నాడు మూడురోజుల క్రితం గురుకులానికి వచ్చిన ఉత్తరాది దుర్మార్గుడు అతడికి.

తెలియకుండానే ఘడియపాటు పోరాటం జరిగింది. ఓపికగా చిరునవ్వుతో శత్రువు దాడిని అడ్డుకోడమే లక్ష్యంగా సమర్థుడు పోరాడుతున్నాడు. అతడిని లొంగదీయడంకోసం ప్రారంభం చేసి, తీవ్రంగా గాయపరిచే లక్ష్యంతో కొనసాగి, అంతంచేయాలనే తలపుతో దాడిచేయడం మొదలుబెట్టాడు పంక్తికంఠన్. ముందు చేతులలోని మణికట్లు, మోచేతులు, మెటికలు మొదలైన పది సంధి స్థానాలపై దాడికి ప్రయత్నించాడు. తరువాత మెడ పైన ప్రమాదకరమైన ముప్పై ఏడు సంధి స్థానాలను గాయపర్చడానికి ప్రయత్నం చేశాడు. అతడి కసి అంతకంతకూ పెరిగిపోతున్నది. రెండు క్షణాలలో కాళ్ళు పట్టించి క్షమార్పణ అడిగిస్తాను అనుకున్నాడు. మూడు ఘడియలపాటు పోరాడి కనీసం సమర్థుడి శరీరాన్ని తాకలేకపోయాడు. అహంకారము, అవమానభారము కలిసి అంధుడిని చేశాయి.

ఇద్దరి శరీరాలు చెమటతో మెరిసిపోతున్నాయి. చేతి విసుర్లు, వేళ్ళ కదలికలు గాలిని చీలుస్తూ సర్రున ధ్వనులు చేస్తున్నాయి. శరీరాలు రాసుకుని ఎర్రవారాయి. ఏనుగులు తొక్కినట్లు గోదా అంతా చెల్లా చెదురు అవుతూ సముద్రకెరటాలలాగా మెత్తని నేల కదులుతున్నది. అత్యంత భయంకరమైన పోరాట విధానంలోకి వచ్చాడు పంక్తికంఠన్. ఛాతీనుండి పొత్తికడుపు వరకూ ఉన్న ఎనిమిది మర్మస్థానాలను లక్ష్యంగా ఎంచుకుని దాడి చేయడం మొదలుబెట్టాడు. ఇనుపముళ్ళవంటి ఆ వేళ్ళు ఆ స్థానాలలో పైపైన తగిలినా యావజ్జీవితము జీవచ్ఛవం కావలసిందే. పూర్తిగా కచ్చితంగా సంధి స్థానానికి తగిలితే లిప్తలో ప్రాణం పోవడమే, తిరుగు వుండదు. గమనించారు అనుభవం ఉన్న విద్యార్థులు. ఆందోళనతో పెరియాసన్ వద్దకు పరుగులు తీశారు. ఇక చాలించాలని చెప్పండి అని ప్రాథేయపడ్డారు. ఆయన చిరునవ్వుతో వారికి ధైర్యం చెప్పాడు. కొత్త విధ్యార్థికి ఏ హానీ జరుగదు అని హామీ యిచ్చాడు. కానీ నియమవిరుద్ధంగా తోటి శిష్యుడిని అంతమొందించే ప్రయత్నం చేయడం శిక్షార్హం అనిపించింది వెంటనే. కరతాళ ధ్వనులు చేస్తూ ' శరవణ జయ! శరవణ జయ! శరవణ జయ వీర మణికంఠ! 'అని బిగ్గరగా నినాదం చేశాడు పెరియాసన్.

మర్మయుద్ధవిద్యలో తొలి శిష్యుడు సుబ్రహ్మణ్యుడు, కుమారస్వామి. తన తండ్రి పరమశివుడినుండి ఆయన ఆ విద్యను గ్రహించాడు. ఆయన మర్మయుద్ధవిద్యకు మానవలోకంలో తొలి గురువు కూడా, ముసలి ఋషిరూపంలో అగస్త్యమహర్షికి మర్మవిద్యను బోధించాడు. ఆ ఆదిసుబ్రహ్మణ్యుడి నామోచ్చారణతో మర్మవిద్యా సాధనలో ఆనాటికి విరామం తీసుకోవాలని నియమం. కానీ ఒక ప్రమాదం జరిగింది, ఒక పొరపాటు జరిగింది.

పెరియాసన్ చేసిన విరమణ సూచనా నినాదం చెవులబడి చెంగున వెనక్కు దూకి నిలుచుండిపోయాడు సమర్థుడు. తన ప్రతీకారపు కసితో మారణపోరాటం చేస్తున్న పంక్తికంఠన్ చెవిన ఆ నినాదం పడలేదో, నిర్లక్ష్యమో కానీ, ప్రమాదం వాటిల్లింది. వెనక్కు దూకిన సమర్థుని మీదకు

లంఘించి తన కుడిచేతి ఐదు వేళ్ళను బాకులలా సమర్థుడి గుండెలో దించాడు పంక్తికంఠన్. ఎడమచేతి వేళ్ళను బొడ్డుకు దిగువన పొత్తికడుపులో యినుప ముళ్ళలా దించాడు. పంక్తికంఠన్ చేతులు రెండూ తడి కుంకుమతో తడిసినట్లు సమర్థుని రక్తంతో బయటకు వచ్చాయి. ఆ క్షణంలో జరిగినది గ్రహించాడు సమర్థుడు.

వికటంగా నవ్వుతూ తన చేతులను చూసుకుంటున్నాడు పంక్తికంఠన్. సమర్థుడు కుప్పలా కూలి, కట్టెలా మారాలి, ఆయన ప్రాణాలు అనంతవాయువులలో కలిసిపోవాలి, అతని అంచనా ప్రకారం.

పాఠకుడా! ఆయన సమర్థరాముడు! కలియుగ హనుమ! ముందుగా ప్రళయవేళలో ఝుమ్మని వీచే గాలిలా 'హూమ్' అని ధ్వని చేస్తూ ఒక ఓంకారనాదం అతి దీర్ఘంగా వెలువడింది ఆయన నోటివెంట. సుడిగాలిలో పండుటాకులా చలించిపోయాడు పంక్తికంఠన్. ఆ ప్రాంగణం అంతా సుడిగాలి వచ్చినట్లు దుమ్మూ ధూళీ రేగింది. మరుక్షణం హుమ్మని ఒక హుంకార ధ్వని రేగింది. కుడిఅరచేతితో చరిచిన చరుపుకు చెవులవెంట, నోటివెంట రక్తపు ధార వెలువరిస్తూ నేలకు రాలిపోయాడు పంక్తికంఠన్. పూర్తిగా నేలమీదకు పడకముందే అతడి ఎడమ భుజాన్ని, కుడి మోకాలిని ఒడిసిపట్టి గడ్డిబొమ్మను ఎత్తినట్టు గాలిలోకి ఎత్తాడు సమర్థుడు. నేలకు విసిరి కొడుతుండగా వినిపించింది దివ్యమైన ఏకాక్షర శ్రీరామ మంత్రం. వెనువెంటనే దివ్యమైన రామరహస్యోపనిషత్ శాంతి మంత్రం వినిపించింది.

కంటికి కనిపించని వేగంతో, శ్రీరామ నామాన్ని ఉచ్చరిస్తూ సమీపించాడు పెరియాసన్. జ్వలిస్తున్న అగ్నిలా వున్నాడు సమర్థుడు. శాంతిమంత్రం వర్షపు ధారలా చల్లబరచింది. దించిన ఆయన చేతి పట్టునుండి నెమ్మదిగా మోకాళ్ళమీద కూలిపోయాడు పంక్తికంఠన్. అప్రయత్నంగానే శిష్యులందరి గొంతులూ శ్రీరామనామాన్ని ఉచ్చరించడం మొదలెట్టాయి. వీరావేశంతో గుండెలకు తాడిస్తున్న పిడికిళ్ళను దించాడు సమర్థుడు. ఆ పిడికిళ్లు అంజలిముద్రలోకి మారాయి. చెవులకు యింపుగా వినిపిస్తున్న నామధారిని మనోనేత్రంతో చూస్తున్నాడో, ఎదురుగా వున్న పెరియాసన్ మూర్తిని చూస్తున్నాడో, అలా నమస్కార ముద్రలో చలనం లేకుండా నిలబడిపోయాడు. క్రమేపీ మామూలు స్థితికి వచ్చాడు. హనుమ పూనాడు అని మనసులో అనుకున్నాడు పెరియాసన్.

!

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS